క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ధీరజ్ కుమార్

మధిర: మధిర కోర్టులో ఫిబ్రవరి 11న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ డి.ధీరజ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం కోర్టులో పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ.. జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీపీ నాగలక్ష్మి భద్రయ్య, కోర్టు సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెనుబల్లి: వ్యవసాయ కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం కల్లూరు డివిజన్ కార్యదర్శి బీరెల్లి లాజర్ డిమాండ్ చేశారు. అన్ని రకాల మిగులు భూములను పేదలకు పంచాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వ్యవసాయ కార్మికులకు ఉచిత బీమా ఇన్సూరెన్స్ ప్రభుత్వం చేయించాలని, అర్హులైన పేదలకు ఇండ్లు మంజూరీ చేయాలని, సొంత స్థలంలో ఇళ్లు కట్టుకునేవారికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటి, ప్రసాద్, వెంకటనర్సయ్య, నరసింహారావు, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

కందాల ప్రసాద్‌కు ఘన నివాళి



కందాల ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పరంజ్యోతిరావు

తల్లాడ: మాలమహానాడు తల్లాడ పట్టణ అధ్యక్షుడు కందాల ప్రసాద్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం ప్రసాద్ దశదిన కర్మకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గిడ్ల పరంజ్యోతిరావు, ప్రధాన కార్యదర్శి ఎం.కాంతయ్య హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా కార్యదర్శి నరసింహారావు, నాయకులు ప్రభాకర్‌రావు, పోలు, పుల్లయ్య, సిలువరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని బుధవారం స్థానిక సర్పంచ్ చెట్టుమాల రేణుక పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భుజించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నాయా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి విలువతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేములపల్లి బాలకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీ ఆలయంలో వసంత పంచమి

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీలలిత సహిత, శ్రీగాయత్రి సహిత శ్రీ జ్ఞానసరస్వతీదేవి ఆలయంలో గురువారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు, సరస్వతీపూజలు నిర్వహించబడతాయని అర్చకులు కిషోర్‌శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

31న సర్వసభ్య సమావేశం

ఏన్కూరు: ఈ నెల 31 మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బయ్యారపు అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలసిందిగా కోరారు.

ఖాళీల వేదన.. మూగరోదన

- పశువైద్యశాలలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- సకాలంలో అందని వైద్యసేవలు
- ఇక్కట్లు పడుతున్న పాడి రైతులు



శిథిలావస్థలో ఉన్న లక్ష్మీపురం సబ్‌సెంటర్



వైద్యుడు లేని పాలడుగు పశువైద్య కేంద్రం

వైరా రూరల్: మూగ జీవాలకు పశు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఒక వైపు పాలకులు పాడి సంపదకు పెద్దపీట వేస్తున్నామని డంబికాలు పలుకుతున్న వాస్తవాలు మరోలా ఉన్నాయి. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటు సరిపడ వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. సబ్ సెంటర్లలో మందుల కొరతతో పశువైద్యశాలలు డీలా పడ్డాయి. అప్పులు చేసి కొనుగోలు చేసిన పశువులు జీవనాధారమవుతున్నాయనుకుంటే సకాలంలో వైద్యం అందక మృతి చెందుతున్నాయని పశుపోషకులు రోదిస్తున్నారు.

మండలంలో ఇలా...

మండల కేంద్రమైన వైరాతో పాటు పాలడుగు గ్రామాల్లోని పశువైద్యశాలలో ప్రధాన వైద్యాధికారి పోస్టులు ఉండాల్సి ఉంది. రెండు పశువైద్యశాలలకు కలిపి 7 సబ్‌సెంటర్ ఉన్నాయి. వైరా పరిధిలో స్నానాల లక్ష్మీపురం, సోమవరం, సిరిపురం, గరికపాడు ఉండగా పాలడుగు ఆస్పత్రి పరిధిలో తాటిపూడి, రెబ్బవరం, గన్నవరం గ్రామాలు ఉన్నాయి. కానీ పాలడుగులో కొన్నేళ్లుగా పూర్తి స్థాయి ప్రధాన వైద్యాధికారి పోస్టు లేనందున ఇన్‌చార్జ్‌లే పశు వైద్య సేవలు అందిస్తున్నారు. పాలడుగులో వెటర్నరీ అసిస్టెంట్ కూడా ఇక్కడ లేరు. అంతే కాకుండా రెబ్బవరం, గన్నవరం గ్రామాల్లోని సబ్‌సెంటర్లలో 10 ఏళ్ల నుంచి అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతే కాకుండా సోమవరం, సిరిపురం, గరికపాడు సబ్‌సెంటర్లలో సుమారు 3 ఏళ్ల నుంచి అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంకా స్నానాల లక్ష్మీపురంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌తో పాటు అటెండర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇంకా పాలడుగు గ్రామంలో ప్రధాన వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేధిస్తున్న మందుల కొరత..

గ్రామాల్లో నిత్యం పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడుతుంటాయి. వైద్యులు లేని చోట్ల అటెండర్లే వైద్యం చేయాల్సిన పరిస్థితి. ప్రధానంగా విష జ్వరాలు, పొదుగు వాపు వంటి వ్యాధులు సోకినప్పుడు మందులు లేక పోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో మందులు కొనుగోలు చేసుకొని పశువులకు వైద్యం చేయించుకోవాల్సి వస్తుంది. ఏళ్ల క్రితం నుంచి సబ్‌సెంటర్లకు ఏడాదికి రూ.9 వేలు, ప్రధాన ఆస్పత్రికి రూ.12 వేలు విలువ చేసే మందులు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కానీ మండలంలో సుమారు 12 వేలకు పైగా గేదెలు, 2 వేలకు పైగా ఆవులు ఉండడంతో సంవత్సరానికి ఈ మందులు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా ఏడాదికి ఒకసారి వైద్యశాలలు, సబ్‌సెంటర్లకు నిధులు మంజూరైనప్పుడు మాత్రమే ఆయా సెంటర్లలో పశువులకు అవసరమయ్యే మందులు లభ్యమవుతాయని దాని తర్వాత ప్రైవేటు షాపులే దిక్కుగా మారాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో ఆస్పత్రి భవనాలు..

మండలంలోని లక్ష్మీపురం, సిరిపురం, గన్నవరం, రెబ్బవరం వంటి గ్రామాల్లో పశు వైద్యశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షాకాలం వస్తే వర్షపు నీరు ఆస్పత్రిలోచేరడం పారిపాటిగా మారింది. అంతేకాకుండా పలు భవనాలు వర్షానికి కురుస్తుండడంతో మందులు భద్రపర్చుకునే పరిస్థితి లేకుండా పోయిందని సబ్‌సెంటర్ల నిర్వాహకులు వాపోతున్నారు. వీటి మరమ్మతుల కోసం పలుమార్లు ప్రతిపాధనలు చేసినా నిధులు కేటాయించడం లేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థలంలో కొత్త భవనాలను నిర్మిస్తే సమస్యలు కొంత మేర తీరుతాయని పలువురు చెబుతున్నారు.

శిథిలావస్థలో సబ్‌సెంటర్..



స్నానాల లక్ష్మీపురంలోని పశువైద్యశాల సబ్‌సెంటర్‌లో మందులు, సిబ్బంది కొరత ఉండడం వలన సబ్‌సెంటర్ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో శిథిలావస్థకు చేరిన సబ్‌సెంటర్‌పై పలు రకాల చెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. పాడి రైతుల సౌకర్యార్థం పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి శిథిలావస్థలో కూలేందుకు సిద్ధంగా ఉన్న సబ్‌సెంటర్ స్థానంలో కొత్త భవనం నిర్మించాలి.

– మల్లు రామకృష్ణ, ఉపసర్పంచ్, స్నానాల లక్ష్మీపురం

వైద్యుడిని నియమించాలి..



పాలడుగులో పశువైద్య కేంద్రం ఉన్నప్పటికీ వైద్యుడి పోస్టు లేకుండా పోయింది. దీంతో ఇక్కడ నిత్యం ఇన్‌చార్జీలే పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు. కొన్నేళ్లు ఇక్కడ విధులు నిర్వర్తిస్తే డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లడం పారిపాటిగా మారింది. పూర్తి స్థాయి వైద్యుడిని నియమించకపోవడంతో పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. పాడి రైతుల సౌకర్యార్థం పూర్తి స్థాయి వైద్యుడిని నియమించాలి.

– షేక్. జాన్‌పాషా, పాలడుగు

దృష్టి లోపాల నివారణకే ‘కంటి వెలుగు’



వైరా: కంటి అద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్



ముదిగొండ: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

వైరా: ప్రజలు దృష్టి లోపంతో బాధపడకుండా దృష్టి లోపాలను నివారించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. బుధవారం వైరా రైతువేదిక భవనంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన కళ్ల జోళ్లను అందించారు. అనంతరం 15వ వార్డు దిద్దుపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొమ్ము అబ్రహం కుటుంబ సభ్యలకు పార్టీ బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందించారు. అదే గ్రామానికి చెందిన నాగటి వెంకన్న ఇటీవల మృతి చెందగా ఆయనకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, వైస్ చైర్మన్ సీతారాములు, 15వ వార్డు కౌన్సిలర్ సురేష్, మున్సిపల్ కమిషనర్ అనిత, టీపీఓ భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: కొణిజర్ల రైతు వేదిక భవనంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సూరంపల్లి రామారావు బుధవారం పరిశీలించారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేష్, సీహెచ్ఓ మధుసూధనరావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకాని: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి గ్రామంలో బుధవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య ప్రారంభించారు. కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతి కిషోర్, గ్రామసర్పంచ్ రేణుక, ఎంపీటీసీ వీరభద్రం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నిఖిల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని బాణాపురంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఈ శిబిరాన్ని క్షయ నివారణ జిల్లా అధికారి సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ శిబిరంలో ఉచితంగా మందులు, కండ్ల అద్దాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ ఆవుల రమ, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్టీసీ కళాజాతా



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బస్టాండ్‌లో కళాజాతా నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లి టౌన్/పెనుబల్లి/తల్లాడ : సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్, పెనుబల్లిలోని వియంబంజర్ బస్టాండ్, తల్లాడ ఆర్టీసీ బస్టాండ్ లలో బుధవారం ఆర్టీసీ కళాజాతా నిర్వహించారు. ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీ బస్‌పాస్‌ల గురించి ఆటపాటలు, నాటికల ద్వారా వివరించారు. ప్రతి రోజు ప్రయాణం చేసే ప్రయాణికుల కోసం 20 రోజుల ప్రయాణ చార్జితో 30 రోజులు ప్రయాణించే విధంగా సీజన్ టికెట్ ఇవ్వడం జరుగుతుందని, తిరుపతికి ఆర్టీసీలో ప్రయాణించే భక్తులకు దర్శనం టికెట్ కూడా ఇవ్వబడుతుందని, లైట్ మోటారు వెహికిల్ లైసెన్స్ కల్గిన యువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించ బడుతుందని తెలిపారు. అదేవిధంగా తారానాక ఆర్టీసీ ఆస్పత్రిలో ప్రజలందరికీ రాయితీపై వైద్యం అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ విజయశ్రీ, స్టేషన్ మేనేజర్ గడ్డం శ్రీనివాసరావు, ఎంఎఫ్ వెంకటనారాయణ, కళా బృందం సభ్యులు టీమ్ లీడర్ సాంబయ్య, శంకర్, శ్రీనివాస్, రమేష్, ఎల్లస్వామి, వెంకటస్వామి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే మధిర అభివృద్ధి



సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్ కమల్ రాజ్

మధిర: సీఎం కేసీఆర్ పాలనలోనే మధిర పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 8,19 వార్డుల్లో 'గుడ్ మార్నింగ్ మధిర'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లోని ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కేసీఆర్ మధిర మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.30 కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతా జయాకర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు అప్పారావు, ఇక్బాల్, నాయకులు కృష్ణప్రసాద్, వెంకటరెడ్డి, బీవీఆర్, ప్రసాదరావు, నారాయణరావు, శ్రీనివాసరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్రకు కృతజ్ఞతలు



జీఓ ప్రతిని చూపుతున్న ముస్లింలు

కల్లూరు: మండల కేంద్రంలోని షాదీఖానా భవన నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేయడంపై ముస్లిం కమిటీ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక జామియా మసీదులో సమావేశం ఏర్పాటు చేశారు. మండల ముస్లిం కమిటీ సదర్ సయ్యద్ అలీ, మసీదు కమిటీ సదర్ ఎస్‌కే ఇమామ్, జమాతే ఇస్లామీ హింద్ మండలాధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. దీనికి మండల ముస్లిం సోదరులంతా సీఎం, ఎమ్మెల్యేలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సదర్ ఎండీ హనీఫ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కమ్లి, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు రవూఫ్, ఇషాక్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముదిగొండ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. మండలంలోని వల్లభిలో తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఖమ్మంలో కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గోవిందరావు, సైదులు, అశోక్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ముదిగొండ: రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీజీవీబీ మేనేజర్ రవిచంద్ర పేర్కొన్నారు. మండలంలోని యడవల్లిలో బుధవారం రైతులకు, డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాశ్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా రుణాలు, రైతులు పొందిన రుణాలు చెల్లించి, బ్యాంకు పథకాలు పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, బ్యాంకు సిబ్బంది శేఖర్, ప్రవీణ్‌బాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు



మృత్యుంజయ స్వామి

మధిర: పట్టణ సమీపంలోని వైరా నది వద్ద వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ శర్మ తెలిపారు. మృత్యుంజయ స్వామి ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్య, పంచముఖ ఆంజనేయ, కాలభైరవ, నందీశ్వర, చండీశ్వర, నవగ్రహ తదితర దేవతామూర్తుల ఆలయ ఆవరణలో జీవ ధ్వజ శిఖర స్థిర యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన తదితర కార్యక్రమాలతో ఫిబ్రవరి 5 నుంచి పూజాధికాలతో ప్రారంభమైతాయన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



వైరా: చిత్ర లేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు.. పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వైరా/పెనుబల్లి: పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగంగా బీజేపీ వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైరాలో చిత్రలేకనం, పెనుబల్లిలో వియంబంజర్ లక్ష్యా పాఠశాలలో వ్యసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ నాయక్, వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఏలే భద్రయ్య, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీ మండలాధ్యక్షుడు బొర్రా నరసింహారావు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, పాఠశాల హెచ్ఎం ఈశ్వర్ నాయకులు వెంకటకృష్ణ, నరేష్, వెంకటసతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యులు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం ప్రతి వారం నిర్వహించే ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. అవసరమైన వారికి పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, సీఆర్పీ తిరపయ్య, భవిత కేంద్రం సంరక్షురాలు లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు.. వజ్రాయుధం

మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. – సాక్షి నెట్‌వర్క్



మధిర: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాంబాబు



వైరా: ఠాగూర్ విద్యాలయంలో.. ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సత్తుపల్లిరూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



పెనుబల్లి: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ అనిత



తల్లాడ: మిట్టపల్లిలో.. ప్రతిజ్ఞ చేయిస్తున్న బీఎల్‌ఓలు



కారేపల్లి: బస్టాండ్ సెంటర్‌లో..



ఏన్కూరు: కొత్త ఓటర్‌ను సన్మానిస్తున్న దృశ్యం



బోనకల్‌లో..



ఎర్రుపాలెం: గాంధీ సెంటర్‌లో..



వేంసూరు: తహసీల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది